# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా జరిగాయని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ తెలిపారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరిగే ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభం కానుంది.**
3. **కొంతమంది వ్యక్తులు సామాజిక మాధ్యమాల వేదికగా సమాజంలో అశాంతి సృష్టిస్తున్నారని.. అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.**
4. **క్యాన్సర్ స్క్రీనింగ్‌ని గ్రామ స్థాయిలోనే నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆ శాఖ కమిషనర్ వెంకటేశ్వర్ వెల్లడించారు.**

==============================

దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా జరిగాయని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ తెలిపారు. ఎన్నికల ముగింపుపై ఈరోజు కేంద్ర ఎన్నికల సంఘం పాత్రికేయుల సమావేశం నిర్వహించింది. ఈసందర్భంగా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 64.2 కోట్ల మంది ఓట్లు వేయడంతో మనం ప్రపంచ రికార్డు సృష్టించినట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 31.2 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ ఇదేనని... 1.5 కోట్ల మంది పోలింగ్, సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తించారని తెలిపారు. 68 వేల 763 బృందాలు ఈ ఎన్నికలను పర్యవేక్షించాయని.. 135 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రీపోలింగ్ అవసరం రాలేదని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలలో జమ్మూకశ్మీర్‌లో అత్యధికంగా 58.58శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు.

......................................

ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరిగే ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఆ తరువాత 8 గంటల 30 నిమిషాలకి ఈవీఎంల లెక్కింపు ప్రారంభం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 33 ప్రాంతాల్లో 375 లెక్కింపు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు 350 కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 75 కేంద్రాలను

ఏర్పాటు చేశారు. ఈరోజు అభ్యర్థుల సమక్షంలో ఆర్వో కార్యాలయాల్లోని అధికారులు స్ట్రాంగ్ రూములు తెరవనున్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలోని పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను లెక్కింపు కేంద్రాలకు అధికారులు తరలించనున్నారు.

ఈసారి లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్‌గా ప్రకటించారు. లెక్కింపు కేంద్రంలో ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్ వద్ద అభ్యర్థికి ఒక ఏజెంటు చొప్పున అనుమతిస్తారు. కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ఏజెంట్లకు బ్రీత్ ఎన్‌లైజర్‌తో ముందుగా పరీక్ష చేస్తారు. మద్యం తాగినట్లు తెలితే లోపలికి అనుమతించరు. తెల్లవారుజామున అయిదు గంటల నుంచే తనిఖీలు చేపట్టనున్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులు, అధికారులు, ఏజెంట్లు జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డులు ధరించి తనిఖీల్లో చూపించాలి. కేంద్రంలోకి ఒక్కసారి ఏజెంట్ వెళితే పూర్తయ్యే వరకు బయటకు రావడానికి వీలు లేదు. మరోవైపు.. అభ్యర్థులు, ఏజెంట్లు తప్ప మిగిలిన ప్రజలెవరూ కౌంటింగ్ కేంద్రాల వద్ద గుమిగూడడానికి వీల్లేదు.

---------------------------

కొంతమంది వ్యక్తులు సామాజిక మాధ్యమాల సమాజంలో అశాంతి సృష్టిస్తున్నారని.. అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేయడం, పీడీ యాక్ట్ ప్రయోగించడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. కౌటింగ్ రోజు, తర్వాత విద్వేషకర పోస్టులను, ఫోటోలను , వీడియోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం లేదా షేర్ చేయడం కూడా నిషిద్ధమని వెల్లడించారు. గ్రూప్ అడ్మిన్‌లు కూడా అటువంటి వాటిని ప్రోత్సహించకూడదని తెలియచేశారు. ఈ విషయాన్ని అందరు గమనించాలని.. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు.

---------------------------

క్యాన్సర్ స్క్రీనింగ్‌ని గ్రామ స్థాయిలోనే నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆ శాఖ కమిషనర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. విశాఖలోని హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి అపెక్స్ కేంద్రంగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ భాగస్వామ్యంతో 30 ఏళ్లు పైబడిన వారి కోసం సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రాంకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు నిన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో రొమ్ము, దంత, గర్భాశయ క్యాన్సర్‌లను పరీక్షించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

---------------------------

భారత ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించింది. రాష్ట్రంలో మొత్తం 60 స్థానాలు ఉండగా.. భారతీయ జనతా పార్టీ 46 స్థానాల్లో విజయం సాధించింది. మరోవైపు సిక్కింలో సిక్కిం క్రాంతికారీ మోర్చా ఎస్‌కేఎం అధికారాన్ని నిలబెట్టుకుంది. రాష్ట్రంలో మొత్తం 32 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా.. ఆ పార్టీ 31 సీట్లు సాధించింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఏప్రిల్ 19వ తేదీన పోలింగ్ జరగ్గా.. ఫలితాలు నిన్న వెలువడ్డాయి.

---------------------------

భరతమాతకు పాదం వంటి కన్యాకుమారిలో తాను నిర్వహించిన ధ్యానం.. సరికొత్త సంకల్పాలకు దారి చూపిస్తోందని భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఎన్నో అనుభవాలు, భావోద్వేగాలతో మది నిండిపోయిందని చెప్పారు. మూడురోజుల ఆధ్యాత్మిక యాత్రను ముగించుకుని శనివారం సాయంత్రం దిల్లీకి వెళ్తూ విమానంలోనే ఆయనొక వ్యాసం రాసి పత్రికలకు నిన్న విడుదల చేశారు. ఇకపై ఒక్క క్షణమైనా వృథా చేయకుండా భారీ లక్ష్యాలు, మహోన్నత విధుల దిశగా మనం అడుగులు వేయాలని పేర్కొన్నారు. ప్రాచీన విలువల్ని పరిరక్షించుకుంటూనే మన సంస్కృతిని ఆధునికంగా పునర్నిర్వచించుకోవాలని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటం మాదిరిగానే వికసిత భారత్ కోసం వచ్చే పాతికేళ్లూ పాటుపడదామని.. కలిసి ముందడుగు వేద్దామని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రేపు ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ఈరోజు జరగాల్సిన పాలిసెట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు సాంకేతిక విద్యా శాఖ నిన్న ఓ ప్రకటనలో తెలిపింది. వాయిదా పడిన కౌన్సెలింగ్‌ను ఈనెల 6వ తేదీన నిర్వహిస్తామని ప్రకటించింది. విజయవాడలోని మూడు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కేంద్రాలలో నిన్న 498 మంది విద్యార్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు.

---------------------------

మన దేశానికి అత్యధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఎఫ్‌డీఐ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగపూర్ నుంచి లభించిందని ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. రెండో స్థానంలో మారిషస్ నిలిచింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొనడంతో భారత దేశానికి వచ్చిన ఎఫ్‌డీఐ 2022-23తో పోలిస్తే 3.5 శాతం తగ్గింది. సింగపూర్ నుంచి అత్యధికంగా 11.77 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ భారత దేశానికి వచ్చింది. 2022-23తో పోలిస్తే ఇది 31.55 శాతం తక్కువ.

---------------------------

రాష్ట్రాలు రెండైనా.. తెలుగువారంతా ఒక్కటేనని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 10 కోట్ల తెలుగు జాతి మేటిగా వెలగాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. నాలెడ్జ్ ఎకానమీతో అవకాశాలను భారతీయులు అందిపుచ్చుకొని భారతీయులు, ముఖ్యంగా తెలుగు ప్రజలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. పేదరికం లేని సమాజం దిశగా రెండు రాష్ట్రాల ప్రయాణం సాగాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో ఆర్థిక అసమానతలను నిర్మూలించి.. సమగ్ర సాధికారత సాధించాలని అభిప్రాయపడ్డారు.

---------------------------

వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఓట్ల లెక్కింపు రోజు కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. పాల్వాయిగేటు తెలుగు దేశం పార్టీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు ఇటీవల దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయస్థానం విచారణ జరిపింది. ఈనెల 6వ తేదీ వరకు పిన్నెల్లిని అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన వెసులుబాటు ఎత్తివేయాలని శేషగిరిరావు పిటిషన్లలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరగనున్న ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కూటమి అభ్యర్థులకు నిన్న దిశానిర్దేశం చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు కేంద్రంలోనే ఉండి.. ఆర్వో నుంచి డిక్లరేషన్ ఫాం తీసుకున్నాకే బయటకు రావాలని కూటమి అభ్యర్థులకు సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అనుమానాలుంటే రీ కౌంటింగ్ కోరాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి అరుణ్‌సింగ్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సహా ఎన్డీయే నేతలు, అభ్యర్థులతో నిన్న దృశ్యమాధ్యమం ద్వారా సంభాషించారు.

---------------------------

నార్వే చెస్ టోర్నీలో భారత ఆటగాడు ప్రజ్ఞానంద ఉత్తమ ప్రదర్శన కొనసాగుతోంది. మూడో రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్‌ను ఓడించిన ప్రజ్ఞానంద.. తాజాగా అయిదో రౌండ్లో అమెరికాకు చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ ఫాబియానో కరువానా పై విజయం సాధించాడు. ఈ గెలుపుతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రజ్ఞానంద టాప్-10లోకి వచ్చాడు.

---------------------------

పోస్టల్ బ్యాలట్ల లెక్కింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం నియమాలపై జోక్యం చేసుకోబోమన్న హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులపై వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పార్టీ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

=====================